

హుండీలు లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

భద్రకాళి హుండీల లెక్కింపు

▸▸ అమ్మవారి ఆదాయం రూ.69.05లక్షలు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 12: చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయంలోని హుండీలను గురువారం లెక్కించారు. హుండీ లెక్కింపులో నోట్లు, నాణెంలు, అన్నదానం ద్వారా మొత్తం అమ్మవారికి రెండునెలల 13 రోజులకుగాను రూ.69,05,827 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో శేష భారతి తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి, ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, వెంకటేశ్వర సేవా సమితికి చెందిన 100 మంది భక్తులు, లలితా సేవా సమితి కరీంనగర్‌కు చెందిన 50 మంది భక్తులతో పాటు ఆలయ సిబ్బంది అందరి సమక్షంలో హుండీలను లెక్కించారు. హుండీ ఆదాయాన్ని దేవాలయ బ్యాంకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఆలయ ఖాతాలో జమ చేసినట్టు ఈవో తెలిపారు.



విజిలెన్స్ దూకుడు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అక్రమాలపై ఫోకస్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉరకలేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి కేయూ భూముల అక్రమాలపై విజిలెన్స్ దృష్టి పెట్టడం హాట్‌టాపిక్‌గా మారింది. ఇటీవల కాలంలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితోపాటు కేయూ మాజీ వీసీ వెంకటరత్నం, కేయూ భూముల అక్రమాలతో పాటు మామునూరు చేపల చెరువులో మట్టి దందాలపై విజిలెన్స్ విచారిస్తోంది. వీటితోపాటు సీఎంఆర్‌ఎఫ్‌లో అక్రమాలు, కేయూ మాజీ వీసీ రమేష్‌పై విచారణ కూడా ప్రభుత్వం విచారణకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో విజిలెన్స్ అధికారులు వరుసగా విచారణలు చేస్తుండటంతో అక్రమార్కుల్లో దడ పెరుగుతోంది. అయితే.. విజిలెన్స్ విచారణలకే పరిమితం అవుతుందా? లేక నిజాలను నిగ్గు తేలుస్తుందా? అనే చర్చ ఓరుగల్లువ్యాప్తంగా జరుగుతోంది. వివరాల్లోకి వెళితే...

సీఎంఆర్‌ఎఫ్‌పై..

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్)లో అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ స్కామ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండలోని రోహిణి, మహబూబాబాద్ జిల్లాలోని సిద్ధార్థ, శ్రీ సంజీవిని ఆస్పత్రులపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వైద్యం చేయకుండానే నకిలీ బిల్లులతో కోట్లాది రుపాయలు అక్రమాలు జరిగినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో విచారణ విజిలెన్స్ టీమ్.. త్వరలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో విచారణ చేయనున్నట్లు సమాచారం.

హెల్త్ సిటీపై..

వరంగల్ హెల్త్‌సిటీపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టింది. రూ.1,100కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అంచనా వ్యయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా గత ప్రభుత్వం రూ.1,725 కోట్లకు పెంచింది. అంతే కాకుండా వరంగల్ సెంట్రల్ జైలుకు చెందిన సర్వే నెంబరు 31, 32లోని 2,75,759 గజాల (56ఎకరాల) స్థలాన్ని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు తాకట్టు పెట్టి రూ.1,173కోట్ల రుణాన్ని గత ప్రభుత్వం తీసుకుంది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. దీంతో ఆగస్టు 30వ తేదీన విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు.



కేయూపై ఫోకస్

కాకతీయ యూనివర్సిటీలో అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టి పెట్టారు. ఎన్నో ఏళ్ల నుంచి కాకతీయ వర్సిటీ భూములు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు అందినప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే ఆరోపణలున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కేయూలో అక్రమాలపై దృష్టి పెట్టింది. విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు కేయూ భూముల అక్ర మణపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. 1956 నాటి సేత్వార్ రికార్డులను పరిశీలించారు. ప్రధానంగా కుమార్‌పల్లి శివారులో సర్వే నెంబరు 229లో కేయూ భూముల్లో వర్సిటీ ఉద్యోగులు ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే నిర్మాణ డాక్యుమెంట్లు అందించాలని 76మందికి విజిలెన్స్ అధికారులు నోటీసులు అందించారు. దీంతో నగరంలో కేయూ భూముల అక్రమణాలపై విచారణ హట్‌టాపిక్‌గా మారింది. అలాగే 2013లో కేయూలో 37మంది ఉద్యోగులను ప్రభుత్వం అనుమతి లేకుండా రెగ్యులర్ చేశారనే ఆరోపణలపై మాజీ కేయూ వీజీ వెంకటరత్నంను గత నెల 16వ తేదీన విజిలెన్స్ అధికారులు విచా రించారు. 11ఏళ్ల నాటి ఉద్యోగాల నియామకంపై విజిలెన్స్ ఫైల్‌ను కదిలించి విచారించటం అధ్యాపక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఆకుట్ ఫిర్యాదు మేరకు కేయూ తాజా మాజీ వీసీ తాటికొండ రమేష్‌పై ప్రభుత్వం మే 18వ తేదీన విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. వీసీ పోస్టింగ్‌కు పదేళ్ల అనుభవం లేకున్నా వీసీగా అక్రమంగా పోస్టింగ్ తెచ్చుకున్నారని, నిబంధనలకు విరుద్ధంగా సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారని, ఎలాంటి అనుమతులు లేకుండానే 16మందిని అనుబంధ అధ్యాపకులుగా నియమించారని, పీ హెచ్‌డీ సీట్లను అనర్హులకు కేటాయించారని, ఫార్మ సీ కాలేజీలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చారనే తదితర ఆరోపణలను వీసీ ఎదుర్కొంటున్నారు. వీటిపైన విజిలెన్స్ అధికారులు అంతర్గతంగా విచారణను చేపట్టారు. త్వరలోనే మాజీ వీసీని ప్రశ్నించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

చేపల చెరువులోనూ..

వరంగల్ మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో అక్రమాలపై ఈనెల 6వ తేదీన విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. కేవీకేలో 2018లో చేపల చెరువు కోసం తవ్విన మట్టిని అక్రమంగా రూ.80లక్షలకు అమ్ముకున్నారనే ఆరోపణలపై చీఫ్ సెక్రెటరీ ఆదేశాల మేరకు పునర్విచారణ చేపట్టిన అధికారులు.. కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లుగా సమాచారం

నిగ్గు తేల్చేనా..?

ఓరుగల్లులో రెండుమూడు నెలలుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ దూకుడుగా వ్యవహరిస్తోంది. అవినీతి, అక్రమాలపై లోతుగా విచారణలు చేపడుతోంది. ముఖ్యంగా కేయూ భూములపై విజిలెన్స్ విచారణ ఉద్రిక్తతకు దారి

▸▸ మిగతా 8వ పేజీలో..

10కిలోల వెండి పట్టివేత



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, సెప్టెంబరు 12: ఎలాంటి బిల్లులు, డాక్యుమెంట్లు లేకుండా అక్రమంగా 10కిలోల వెండి వస్తువులు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వెండిని స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. గురువారం రాత్రి వరంగల్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ గురువారం సాయంత్రం ఇంతేజార్‌గంజ్ పోలీసులు వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారి హ్యాండ్ బాగుల్లో 10 కిలోల వెండికి సంబంధించిన వస్తువులు దొరికాయని తెలిపారు. వాటికి సంబంధించిన రశీదులు, డాక్యుమెంట్లు ఎలాంటి ఆధారాలు ఇవ్వలేదని తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన మురుగన్ కన్నన్, మురగేషన్, గోకుల్‌ల వద్ద 10 కిలోల వెండిని స్వాధీన పరుచుకున్నట్లు ఏసీపీ తెలిపారు. వెండి ఆభరణాలు సిద్దిపేట నుంచి తీసుకువస్తున్నట్లు వారు పోలీసు విచారణలో తెలిపినట్లు వెల్లడించారు. వీటి విలువ సుమారు ఎనిమిది లక్షల వరకు ఉంటుందన్నారు. వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావే శంలో ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మంచ శివకుమార్, ఎస్సైలు వెంకన్న, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల హోల్టింగ్ పొడిగింపు

▸▸ శాతవాహన, ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ రైళ్లు మరో ఆరునెలలు హోల్టింగ్

గిర్మాజిపేట, సెప్టెంబరు 12: ప్రస్తుతం చర్లపల్లి, మహబూబాబాద్, జమ్మికుంట, మంచిర్యాల్ రైల్వే స్టేషన్‌లలో కొనసాగుతున్న కొన్ని రైళ్ల తాత్కాలిక హోల్టింగ్‌లను ప్రయాణికుల సౌకర్యార్థం మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌర సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా విజయవాడ -సికింద్రాబాద్ శాతవాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గుంటూరు- సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సిరిపూర్ కాగజ్‌నగర్ -సికింద్రాబాద్ ఇంటర్‌సిటీలు చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం నుంచి యథావిధిగా మరో ఆరునెలల పాటు ఆగుతాయని తెలిపారు. అలాగే మహబూబాబాద్‌లో నర్సాపూర్-నాగర్‌సోల్ ఎక్స్ ప్రెస్, జమ్మికుంటలో సికింద్రాబాద్-ధానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు గురువారం నుంచి, మంచిర్యాలలో పుణే-కాజీపేట వీక్లి ఎక్స్‌ప్రెస్ ఈనెల 20నుంచి యథావిధిగా మరో ఆరునెలలు ఆగుతాయని పేర్కొంది.

మక్కలు క్వింటా రూ.3,090



మక్కలు అమ్మిన రైతు తిరుపతి

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 12: వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో గురువారం మొక్కజొన్నలకు మరింత ధర పెరిగింది. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమారేడిల్లి గ్రామానికి చెందిన పెండ్లి తిరుపతి 66బస్తాల మక్కలు మార్కెట్‌కు అమ్మకానికి తీసుకురాగ సదా ట్రేడర్స్ నిర్వాహకుడు సదానందం క్వింటా రూ.3,090 చొప్పున కొనుగోలు చేశారు. వారం రోజుల క్రితం క్వింటా రూ.3,070 పలుకగా మార్కెట్ చరిత్రలో అదే రికార్డు ధరగా నిలిచింది. తాజాగా మరో రూ.20 అదనంగా పెరగడం విశేషం.

మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 12: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులపాటు సెలువులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మార్కెట్ యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం వినాయక నిమజ్జనం సెలవు, మంగళవారం ఈద్ మిలాద్ నబీ పండగను పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్టు పేర్కొన్నారు. బుధవారం నుంచి మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, వ్యాపారులు, కార్మికులు ఏనుమాముల మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

గణేష్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయండి

▸▸ అధికారులు సమన్వయంతో పనిచేయాలి

▸▸ సమీక్షా సమావేశంలో కలెక్టర్ సత్యశారద ఆదేశం





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద, వడ్డెపల్లి చెరువు సందర్శించి సూచనలు చేస్తున్న డీసీపీ సలీమా

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 12: గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సీపీ అంబర్ కిశోర్ ఝాతో కలిసి కలెక్టర్ గణేష్ నిమజ్జనంపై ఉత్సవ కమిటీలు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇరిగేషన్, విద్యుత్, ఆర్ అండ్ బీ, ఫిషరీస్, మునిసిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో శానిటేషన్, విద్యుత్ దీపాలు, మంచి నీటి సౌకర్యం, భారీ క్రేన్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు.

సీపీ అబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగే విధంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. షిఫ్టుల వారీగా విధులు కేటాయించి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. చెరువుల్లో నీటి మట్టం ఎక్కువగా ఉన్నందున గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు పోలీసుల నియమ నిబంధనలు పాటించి నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా ఇబ్బందులు తలెత్తితే 79016 28362, 91542 52936 సెల్ నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ షేక్ సలీమా, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషన్ రాజేందర్‌రెడ్డి, ఆర్డీవో కృష్ణవేణి, అధికారులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన డీసీపీ

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 12: గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిసిన అనంతరం వినాయక నిమజ్జనాలు చేసే దేశాయిపేటలోని చిన్న వడ్డెపల్లి చెరువును సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా బుధవారం రాత్రి సందర్శించారు. ఇంతెజార్‌గంజ్ పోలీసు స్టేషన్ సీఐ మచ్చ శివకుమార్‌కు వినాయక నిమజ్జనం సందర్భంగా చిన్న వడ్డెపల్లి చెరువులో జరిగే నిమజ్జనం ఏర్పాట్లు నిమజ్జనం సందర్భంగా బందోబస్తు కొరకు సీఐకి డీసీపీ పలు సూచనలు చేశారు. నగరంలోని వినాయక విగ్రహాలను చిన్న వడ్డెపల్లి చెరువుకు తరలిస్తారని ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఇబ్బందులు ఎదురు కాకుండా ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చర్యలు చేపట్టాలని సీఐకి డీసీపీ సూచించారు.

దేశంపై రాహుల్ గాంధీ విషం చిమ్ముతున్నారు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



వరంగల్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

మిల్స్‌కాలనీ, సెప్టెంబరు 12: ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక, దేశం మీద అక్కసుతో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీ విషం చిమ్ముతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ ధ్వజమెత్తారు. రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం వరంగల్ చౌరస్తాలో శ్రేణులు రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేశాయి. రవికుమార్ మాట్లాడుతూ... అమెరికా పర్యటనలో భారత కీర్తి ప్రతిష్టలు, ప్రజాస్వామ్యం, ప్రజలను అవమానించేలా రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. భారత వ్యతిరేక శక్తులు, వ్యక్తులతో రాహుల్ సమావేశమవడందుర్మార్గమన్నారు. రిజర్వేషన్ల రద్దుకు తెరలేపుతున్నారని, అప్పుడు నెహ్రూ, ఇందిరా గాంధీ ఎస్సీ, ఎస్టీ, బీసీల సామాజిక న్యాయానికి తూట్లు పొడిస్తే, ఇప్పుడు వాళ్ల వారసుడిగా అదే పనిని మరోసారి చేసేందుకు రాహుల్ ప్రయత్నాలు ప్రారంభించారని ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ రిజర్వేషన్ వ్యతిరేక వైఖరి బయటపడిందన్నారు. రిజర్వే షన్లను బీజేపీ ఎన్నటికీ రద్దు చేయదని, దేశభద్రతతో చెలగాటమాడితే ఎంతటి వారినైనా ఉపేక్షించదని హెచ్చరించారు. రిజర్వేషన్లు కల్పించిన అంబేద్కర్‌ను ఓడించిన నీచచరిత్ర కాంగ్రెస్‌కే సొంతమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్, నాయకులు రంజిత్‌కుమార్, వెంకటరమణ, రంజిత్‌రావు, రఘునారెడ్డి, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

నేడు ఓటర్ల జాబితా ప్రదర్శన

▸▸ 18, 19న రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

కాశిబుగ్గ, సెప్టెంబరు 12: పంచాయతీల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల వారీగా ఓటర్ల జాబితాను శుక్రవారం జిల్లాలోని అన్ని గ్రామాల్లో, ఎంపీడీవో కార్యాలయల్లో ప్రదర్శించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. సర్పంచుల పాలన ముగిసి రెండు నెలలు దాటింది. దీంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన సాగిస్తోంది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ఓటర్ల జాబితా రూపొందించడానికి ఇప్పటికే షెడ్యూల్ జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఓటర్ల జాబితా రూపొందించే షెడ్యూల్‌లో మార్పులు చేశారు. తాజా షెడ్యూల్ ప్రకారం శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీల్లో, ఎంపీడీవో కార్యాలయాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాను వార్డుల వారీగా ప్రదర్శిస్తారు.

ఈనెల 18న జిల్లా స్థాయిలో, 19న మండల స్థాయిలో రాజకీయ పార్టీల నేతలతో అధికారులు సమావేశాలు నిర్వహిస్తారు. ఓటర్ల జాబితాపై ఈనెల 14 నుంచి 21వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 26లోగా వచ్చిన అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి పరిశీలించి తుది జాబితాను రూపొందించాల్సి ఉంటుంది. ఈనెల 28న ఓటర్ల తుది జాబితాను వెల్లడించనున్నారు.

PROCLAMATION OF SALE

(O-21, Rule 64, 66 of CPC)

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి, వరంగల్ గారి న్యాయస్థానము

E.P.NO.68 OF 2022

Between:

Goli Srinivas Rao, S/o. Sambashiva Rao, Age : 45 years, Occ : Agriculture, R/o. Flat No. 301, H.No. 51-4-15, Pathuru Towers, Gundala Vijayawada. ..D.Hr.

AND

Cheppala Venkata Sharma, S/o. Shankar Sharma, Age : 50 years, Occ: Pujari, R/o. H.No.11-29-56/2, II-Bank Colony, Prudvi Nagar, Warangal ...J.Dr.

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా పైన తేలిపిన Degree Holder తనకు రావల్సిన డబ్బులు రాబట్టు కొనుటకై O.S.No. 100 OF 2016 ద్వారా డిక్రి పొంది ఉన్నారు. సదరు డిక్రి అనుసరించి చెల్లించవలసిన అసలు మిత్తి మరియు ఖర్చులు చెల్లించని కారణంగా E.P.No. 68 OF 2022 ద్వారా మొత్తం డబ్బులు రాబట్టుకొనుటకై శ్రీ చిప్పాల వెంకటశర్మ గారి స్వాధీనాభవ, యాజమాన్య హక్కు భుక్తంలోని దిగువ షెడ్యూలు స్థిరాస్తిని బహిరంగ వేలం ద్వారా అమ్ముటకు కోర్టు వారు **దివి. 30-9-2024** రోజన ఉదయం **10:30** నిమిషాలకు సమయం నిర్ణయించనైనది. కావున అసక్తి కల వారు **30-09-2024** రోజున ఉదయం **10:30** ని॥పై కోర్టు నందు హాజరై బహిరంగ వేలంలో పాల్గొనవచ్చును. **28-10-2020** వరకు Degree బాపతు అసలు, వడ్డీ మరియు ఖర్చులు కలిపి మొత్తం గోలి శ్రీనివాస రావుకు రావల్సిన బకాయి డబ్బులు **రూ॥13,54,600/-** మరియు తదుపరి వడ్డీ, ఖర్చులు.

SCHEDULE OF THE PROPERTIY

A Two storied residential house bearing No. 11-29-56/2, to an extent of 253.00 Sq. Yards situated in Second Bank Colony, Deshaipet Road, Warangal City & Distict. East : 30 Feet Raod; West : Polt of Mallesham; North : 30 Feet Road; South : Polt of Nagaraju.

J.Dr. ప్రకారంగా ఆస్తి విలువ : **60,00,00/-**

Sub Resistrar, ప్రకారంగా ఆస్తి విలువ : **46,13,400/-**

Sd/- E. VENUGOPAL RAO
Advocate
H.No.4-7-131, Kumarapally, Hanamkonda.
Cell : 9848248211

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 12: గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొర్రెకుంట ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పేకాట శిబిరంపై దాడి చేశారు. 10 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి రూ.20 వేల నగదు, ఐదు బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న 10మందిలో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం గీసుగొండ పోలీసులకు అప్పగించారు. ఆరుగురు పరారయ్యారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాజు ధ్రువీకరించారు.

నేడు నిట్‌లో ఫార్మా ఏఐ సదస్సు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12: కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)ఆధ్వర్యంలో ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ పేరుతో ఫార్మా ఏఐ సదస్సును నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నిట్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సులో సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి డి.ప్రదీప్ ప్రారంభోపన్యాసం ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండలో ఫార్మారంగం భవిష్యత్తును చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 6డీ వర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ తాళ్లూరి, డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ ఎ.శ్రీకాంత్, డిప్యూటీ డైరెక్టర్ జి.రాంధన్, డాక్టర్ రెడ్డీస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ ఓరుగంటి తదితరులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధితో పాటు జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.సత్యశారద తదితరులు పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సు సాయంత్రం 4.30 గంటల వరకు ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

దళితులను బహిష్కరించడం దుర్మార్గం

వడ్డేపల్లి, సెప్టెంబరు 12: మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం గోతోజీగూడెం గ్రామంలో డప్పు కొట్టలేదని దళితుడు పంచమి శంకరయ్యతోపాటు కుటుంబ సభ్యులను గ్రామ బహిష్కరణ చేయడం దుర్మార్గమని మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుకటి జనార్దన్ మాదిగ అన్నారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఎంహెచ్‌డీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శంకరయ్య చిన్న కుమారుడు జేఎన్‌టీయూలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న కారణంగానే కక్ష కట్టి అగ్రవర్ణ ఆధిపత్య భావజాలం కలిగిన గ్రామ పెద్దలు గ్రామ బహిష్కరణ చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు ఎస్పీ, ఎమ్మెల్యే, ఎంపీలు శంకరయ్య కుటుంబానికి అండగా నిలవాలని ఎలుకటి జనార్దన్ మాదిగ కోరారు. ఎంహెచ్‌డీ రాష్ట్ర, జిల్లా నాయకులు రమేష్, రాజేష్, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

వర్సిటీ భూముల్లో నివాసితులకు చుక్కెదురు

- హైకోర్టు మెట్లెక్కిన 9 మంది కాలనీవాసులు
- స్టేకు నిరాకరించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 12 : కాకతీయ యూనివర్సిటీ సర్వే నెంబరు 229లో నివాసముంటున్న 9మందితో పాటు మరికొందరు రాష్ట్ర హైకోర్టు మెట్లెక్కారు. కొన్నేళ్లుగా సర్వే నెంబర్ 229లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న నేపథ్యంలో వర్సిటీ అధ్యాపకుల సంఘం, వర్సిటీ విద్యార్థి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర విద్యాశాఖాధికారులకు వేర్వేరుగా ఫిర్యాదులు చేశాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల నేతృత్వంలో రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ప్రత్యేక సర్వే చేపట్టింది. వర్సిటీలోని అన్ని సర్వే నెంబర్లలో సర్వే చేపట్టి భూ కబ్జాలను తేల్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. దీనిలో భాగంగా రెండురోజులుగా వర్సిటీలోని బీసీ కాలనీలో అధికారులు సర్వే చేపట్టారు. సర్వేలో బీసీకాలనీకి చెందిన భవనాలు, అంతర్గత ప్రధాన రహదారి సైతం వర్సిటీ భూముల్లోనే ఉందని రూఢీ అయింది. దీంతో మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కబ్జాల్లోకి వచ్చిన వారిపై చట్టరీత్యా చర్యలకు ఉపక్రమించారు.

హైకోర్టులో..

జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ సర్వేలతో వర్సిటీ భూముల వివరాలన్నీ పక్కాగా లెక్కలు తేల్చేపనిలో ఉండగా, 229 సర్వే నెంబర్‌తో పాటు గుండ్లసింగారం, కుమార్‌పల్లి సర్వేనెంబర్ల పరిధిలోని తొమ్మిది మంది గతంలో రాష్ట్ర హైకోర్టు తలుపులు తట్టారు. గతంలో వేసిన పిటిషన్ సెప్టెంబరు 12న గురువారం విచారణకు వచ్చింది. వర్సిటీ భూకబ్జాదారులు తరుపున న్యాయవాది స్టే ఇవ్వాలని కోరడంతో హైకోర్టు స్టేకు నిరాకరించింది. మునిసిపల్ అధికారులు నోటీసు ఇచ్చారని, కూల్చివేతలకు పాల్పడే అవకాశం ఉందని కోర్టుకు తెలుపడంతో కోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. అయితే మునిసిపల్ అధికారులు తదుపరి చర్యలు తీసుకునే ముందు భూకబ్జా, అక్రమణ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిచ్చిన డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులు చట్టానికి అనుగుణంగా ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని హైకోర్టు అభిప్రాయాన్ని వెల్లడించింది. కాగా, కోర్టు మెట్లెక్కిన వర్సిటీ కాలనీలకు హైకోర్టు తాజాతీర్పులో ఊరట లభించకపోవడంతో వర్సిటీ భూముల చెర వీడనుంది. వర్సిటీ భూముల కబ్జాలకు పాల్పడిన వారిలో ఆందోళన మొదలైంది. కబ్జాలు తెలిన తక్షణమే కూల్చివేతలు చేపడుతామని ఇప్పటికే మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. కాగా, హైకోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉందని హైకోర్టుకు వెళ్లిన బాధితులు చెబుతున్నారు.

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

మడికొండ, సెప్టెంబరు 12: మరణానంతరం నేత్ర దానంతో ఇద్దరు అంధులకు కంటిచూపు చేకూరుతుందని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొన్‌రెడ్డి మల్లారెడ్డి అన్నారు. గురువారం కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన బిల్ల ధర్మారెడ్డి (55) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకొచ్చారు. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి డాక్టర్ లక్ష్మణ్ ద్వారా నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాణించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 : నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ప్రధానోపాధ్యాయుటు శ్రీరాములు అన్నారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి బానోత్ గణేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్స్ బేస్‌బాల్ పోటీల్లో గణేష్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా గణేష్ రాణిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ మందుల పద్మ, ఉపాధ్యాయులు రవి, రవికుమార్, ప్రేమ్‌కుమార్, ఉమారాణి, కృష్ణ, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, శ్రీలత పాల్గొన్నారు.

ఎస్ఎఫ్‌సీ కోర్సుల డబ్బులపై విచారణ జరపాలి

- కేయూ పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు కిరణ్‌గౌడ్



మాట్లాడుతున్న పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 12: కేయూ ఎస్ఎఫ్‌సీ కోర్సులకు చెందిన రూ. 40 కోట్లు అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో వెంటనే విచారణ జరపాలని కేయూ పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కేయూ క్యాంపస్‌లోని క్యాంటీన్ ఎదుట ఏర్పాటు చేసిన పార్టుటైం అధ్యాపకుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోల్తి కిరణ్ గౌడ్ హాజరై మాట్లాడారు. ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లోని వీసీ, రిజిస్ట్రార్‌లు రూ.40కోట్లు దారి మళ్లించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఐదేళ్లకోసారి ఎస్ఎఫ్‌సీ కోర్సులన్నీ రెగ్యులర్ కోర్సులుగా అప్‌గ్రేడ్ చేయాలనే నిబంధనలున్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. 15ఏళ్లు దాటినా ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ చేయడం లేదన్నారు. అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు చేపట్టిన ఎస్ఎఫ్‌సీ కోర్సులన్నీ డబ్బులన్నీ తిరిగి ఆయా కోర్సులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేయూ పార్టుటైం అసోషియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ కె.నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్‌కుమార్, సలహాదారులు కృష్ణ సుమంత్, శ్యాంసుందర్‌చారి, రజనీకాంత్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

- బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయినగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

- సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం
- ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు టీఎస్ఎస్ఎన్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

- సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!


- ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

- ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ
- ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలే దని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ ఛైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

- ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..
- హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్
- పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్‌సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ ఛైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా పీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. పీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జల వనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

- త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే
- హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు
- సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు
- లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే... వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా...సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

- బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్యలోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.



ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, సెప్టెంబరు 12: మద్య తాగి వాహనం నడిపిన కేసులో వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 35మంది వాహనదారులకు జరిమానాను వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గుర్రపు వీరాస్వామి విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి వరంగల్ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 35మంది వాహనదారులకు రూ.56,400, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురు వాహనదారులకు రూ.4,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి అమానుషం

మిల్స్‌కాలనీ, సెప్టెంబరు 12: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ దాడి అమానుషమని నగర డిప్యూటీ మేయర్ రిజ్వానషమీమ్ మసూద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌశిక్‌రెడ్డిపై దాడి ముమ్మాటికీ అప్రజాస్వామిక చర్యగా పేర్కొన్నారు. బీఆర్ఎస్ బీఫాంపై గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపణ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న భవానిసింగ్

ఎయిడ్స్ నియంత్రణకు సహకరించాలి

నేషనల్ ఎయిడ్స్ సొసైటీ అడిషన్ డైరెక్టర్ భవానిసింగ్

మట్టెవాడ, సెప్టెంబరు12: ఎయిడ్స్, హెచ్ఐవీ నియంత్రణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ ఆర్గనేషన్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ భవానిసింగ్ అన్నారు. గురువారం వరంగల్ ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, జిల్లా ఎయిడ్స్ విభాగం ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భవానిసింగ్ మాట్లాడుతూ దేశంలో ఎయిడ్స్, హెచ్ఐవీ చాపకిందనీరు వ్యాప్తి చెందుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు లైఫ్ స్కిల్స్‌పై శ్రద్ధపెట్టాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోడిమ్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 87ఫీట్ల రెడ్ రిబ్బన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ అడిషనల్ ప్రాజెకు డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ విజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో మదన్‌మోహన్, డెమో అశోక్‌రెడ్డి, సీడీఎం మాధురి, అధ్యాపకులు డాక్టర్ ఎస్.అనిత, డాక్టర్ శ్రీధర్, సంజీవ, జి.శ్రీనివాస్, చండీశ్వర్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులను అరికట్టాలి



తహసీల్దార్ కార్యాలయంలో స్థానికులు, ఆర్ఎంపీ, పీఎంపీలు

ఖిలావరంగల్, సెప్టెంబరు 12: నగరంలో ఇటీవల ఆర్ఎంపీ, పీఎంపీలపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యుల దాడులను అరికట్టాలని ఖిలావరంగల్ కోటలో గురువారం స్థానిక నాయకులు, ప్రజలు నిరసన తెలిపారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ స్థానిక ప్రాంతంలో నిత్యం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యం చేస్తున్న వారిపై ఐఎంఏ వైద్యుల దాడిని ఖండించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండి కోటేశ్వర్‌రావు, తీగల జీవన్, బైరబోయిన దామోదర్‌యాదవ్, పోశాల సారంగపాణి, సాగర్ల శ్రీనివాస్, పుప్పాల రాజేందర్, ఆర్ఎంపీ, పీఎంపీలు శ్రీనివాస్, రామకృష్ణ, రాజేందర్, శ్యామ్‌ప్రసాద్, అనిల్, నరేందర్, రాజు, పాల్గొన్నారు.

ఎద్దు పొడవడంతో రైతు మృతి



సాంబయ్య(ఫైల్)

గీసుగొండ, సెప్టెంబరు 12: ఎద్దు పొడవడంతో ఓ రైతు మృతిచెందిన ఘటన మండలంలోని శాయంపేట హవేలిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సముద్రాల సాంబయ్య(58) గ్రామ సమీపంలోని తన పొలంలో వ్యవసాయ పనులు చేసేందుకు బుధవారం ఎడ్లను తీసుకొని వెళ్లాడు. అక్కడ వాటిని మేపుతూ సాంబయ్య పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఒక ఎద్దు వచ్చి సాంబయ్యను పొడవగా, కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు.

గణనాథుడికి ఘనంగా పూజలు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 12: గణపతి నవరాత్రి ఉత్సవాలు గురువారానికి ఆరో రోజుకుచేరాయి. గురువారం కుంటిభద్రయ్య దేవాలయం మల్లికార్జున స్వామి ఆలయం ముందు గణపతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం, శివనగర్‌లోని నాలుగు మండపాల వద్ద అన్నదానం, ఎల్లంబజార్‌లోని గణ పతి మండపం వద్ద అన్నదానం, హంటర్‌రోడ్డులోని వినాయకుడి వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రామన్నపేటలోని శ్రీసీతారామ కల్యాణోత్సవ సమితి ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శివలింగంతో కూడిన వినాయకుడికి 108 నైవేద్యాలతో మహా నైవేద్య నివేదన నిర్వహించారు.

- ఖిలావరంగల్: లేబర్ కాలనీ బస్టాండ్ వద్ద కింగ్స్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద, అబ్బనికుంటలో కళాకారులు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పెరకవాడలో నవయుగ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డు ఎక్సైజ్ సీఐ దిడ్డి నరేందర్ పాల్గొన్నారు.
- గిర్మాజిపేట: దయానంద్ కాలనిలో సిద్ది వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన గణపతికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి మీసాల ప్రకాష్ ప్రత్యేక పూజలు చేశారు.
- కాశిబుగ్గ: కాశిబుగ్గ వర్తక సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు గుండేటి కృష్ణమూర్తి, గుండేటి నరేంద్రకుమార్, ఓంకార మూర్తి తదితరులు పాల్గొన్నారు. కాశిబుగ్గ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కాలనీలో గణేషుడిని శాకంబరిగా వినాయకుడిని అలంకరించారు. అనంతరం అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మెట్టు తిరుపతి రెడ్డి, కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు. న్యూ కళాంజలి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానంలో కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ పాల్గొన్నారు. స్వర్ణ భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మహా అన్నదానం నిర్వహించారు. ఓ సిటిలోని క్లాసిక్ టవర్స్‌లో గరిక పూజ నిర్వహించారు.
- వరంగల్‌సిటీ: ఏనుమాముల ఎన్‌టీఆర్‌నగర్‌లో యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గుడిజేటి రాజు, బబ్బుల సుదర్శన్, బబ్బుల వెంకటేశ్వర్లు, రాపాక ఆనందచారి, చేతి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరో రోజుకు చేరిన నవరాత్రి ఉత్సవాలు



ఓ సిటీలో గరిక పూజలో పాల్గొన్న మహిళలు



కుంటిభద్రయ్య దేవాలయం వద్ద అన్నదానం

- శంభునిపేట : రంగశాయిపేట కటికవాడలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో కుంకుమ పూజ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, యూత్ సభ్యులు, ఆర్వైఎఫ్ సభ్యులు పాల్గొన్నారు. జయశంకర్ కాలనీ, సాయినగర్‌కాలనీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.రంగశాయిపేట, శంభునిపేట ప్రాంతాల్లోని ప్రతిష్ఠించిన వినాయకులను 5రాత్రులు పూజలు చేసి బెస్తం చెరువులో నిమజ్జనం చేశారు. బెస్తం చెరువు వద్ద మామునూరు సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

బీజేపీతోనే దళితులకు న్యాయం

ఎస్సీ సెల్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి శంభునాథ్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 12: దళిత సామాజిక వర్గానికి సమన్యాయం జరగాలంటే బీజేపీ పార్టీతోనే సాధ్యమని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి శంభునాథ్ తుండియా అన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం హంటర్‌రోడ్డులో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తుండియా మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అయిన బీజేపీలో చేరాలని పిలుపునిచ్చారు. షెడ్యూల్డ్ కులాల కోసం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని బీజేపీ పాటిస్తుంటే.. కాంగ్రెస్ మాత్రం ఎన్నికల్లో అంబేద్కర్‌ను ఓడించి అవమానపరిచిందన్నారు. పంచతీర్థల పేరుతో ఆయన జ్ఞాపకాన్ని ఐదు ప్రాంతాల్లో అభివృద్ధి చేసింది బీజేపీ అని గుర్తు చేశారు. దళితులను రక్షించాలన్న, అభివృద్ధి చేయాలన్న బీజేపీ మాత్రమే చేస్తుందన్నారు. గతం కంటే ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు అత్యధికంగా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, మాజీ శాసనసభ్యులు మార్తినేని ధర్మారావు, ఒంటేరు జయపాల్, అరూరి రమేశ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.బాబురావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంభునాథ్ తుండియా

విజిలెన్స్ దూకుడు

5వ పేజీ తరువాయి

తీసింది. కొన్ని ఏళ్లగా భూ కబ్జాలపై ఎన్నో ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే ఆశతో విద్యార్థులు, అధ్యాపకులు ఎదురుచూస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకట్ట పడుతుందనే చర్చ జరుగుతోంది. అలాగే గత ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ వ్యయంపైన కూడా నిజాలు విజిలెన్స్ నిజాలను వెలుగులోకి తీసుకువస్తారని, సీఎంఆర్ఎఫ్‌లో కోట్లాది రూపాయల దుర్వినియోగంపై కూడా వాస్తవాలు బయటకు తీసుకువస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. విజిలెన్స్ చేపడుతున్న విచారణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అక్రమార్కులు ఇప్పటికే నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డట్లుగా ప్రచారం జరుగుతోంది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విచారణలతోనే వదిలేస్తారా? లేక ప్రభుత్వం పరంగా చర్యలు ఉంటాయా? అనే చర్చ ఓరుగల్లువాసుల్లో జరుగుతోంది.

‘భద్రకాళి ఆలయంలో అధిక ధరల అమ్మకాలను అరికట్టాలి’

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 12: భద్రకాళి దేవస్థానంలో భక్తులు సమర్పించే కొబ్బరికాయలను కొట్టి, కొబ్బరి నీటిని విక్రయించడమేకాకుండా, పూలు, కొబ్బరి కాయలు అమ్మే టెండర్ దారులు అధిక ధరలకు విక్రయాలను అరికట్టాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్ కోరారు. ఈ విషయంపై ఆలయ ఈవో పట్టించుకోవడం లేదని, అధికారులు సమస్యను పరిష్కరించాలని గురువారం దేవాదాయ శాఖ ధార్మిక భవన్‌లో ఉప కమిషనర్ శ్రీకాంతారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తితో కొబ్బరికాకలు కొడితే ఆ నీటిని విక్రయించడం తగదన్నారు. కొబ్బరికాయలు, పూలు విక్రయించే టెండర్‌దారులు దేవాలయం నిర్ణయించిన ధరల కంటే 200శాతం రేట్లు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, చెప్పుల స్టాండ్ ఉచితమైన ఆ స్టాండ్‌లో దేవస్థానానికి చెందిన సంబంధిత వ్యక్తికి చెందిన ఒక వ్యక్తి చెప్పుల స్టాండ్ వద్ద ఉండి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

ప్రస్తుత టెండర్ల న్నీ రద్దుచేసి కొత్త టెండర్లను పిలవాలని డీసీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్, జిల్లా అధ్యక్షుడు మడిపల్లి నాగరాజు గౌడ్, ఎన్.రాజు, నూరం రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దేవాదాయ ఉప కమిషనర్‌కు ఫిర్యాదుల వినతిపత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు భూపాల్



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్యకర్తలు

‘ఏచూరి మరణం తీరని లోటు’

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 12: భారత విప్లవ ఉద్యమాలకు సీతారాం ఏచూరి మరణం తీరని లోటని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు బాబు అన్నారు. గురువారం రామన్నపేట ఏరియా కమిటీ ఆధ్వర్యంలోరఘునాథ్‌కాలనీలోని సీపీఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా కమిటీ సభ్యులు అరూరి రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాబు మాట్లాడుతూ ఏచూరి తన చిన్నతనం నుంచే విలపల్వ పార్టీలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన సేవలు పార్టీకి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో కొల్లోజు రమేష్, దామెర శ్రీనివాస్, కందుకూరి రమేష్, బొయపల్లి గాలయ్య, పులిమాటి శివ, దుప్పటి బాబు, శరబందాచారి, సంపత్, కిరణ్, రవి, ఏలిషా పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

కరీమాబాద్, సెప్టెంబరు 12: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు దాతల ద్వారా అందుతున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి సూచించారు. గురువారం ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతానికి చెందిన వలబోజు శ్రీనివాస్ ఉమా దంపతులు పాఠశాలలోని 170 మంది విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. అనంతరం దాతలను సన్మానించారు. అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సముద్రాల రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానించిన వడుప్సా

ఉత్తమ ఉపాధ్యాయలకు సన్మానం

కరీమాబాద్, సెప్టెంబరు 12: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను వడుప్సా వరంగల్ జోన్ కార్యవర్గం గురువారం సన్మానించింది. కరీమాబాద్‌లోని వాణి విద్యానికేతన్ హైస్కూల్లో నిర్వహించిన అభినందన సభలో అవార్డు అందుకున్న పంచకం నర్సయ్య చాందిని బేగం, సెగ్గోజు ఖన్నాలను వడుప్సా వరంగల్ జోన్ అధ్యక్షుడు బొల్లం కనకయ్య ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో వడుప్సా జోన్ ప్రధాన కార్యదర్శి జన్ను విలియం, కోశాధికారి బాలవారి సుధీర్, ముఖ్య సలహాదారు ఎస్.సుధాకర్, సలహాదారు యాద విద్యాసాగర్, ఉపాధ్యక్షుడు సింగారపు రాజు, జాయింట్ సెక్రటరీ ఎండి నజీరుద్దిన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉస్మాన్ అలీ, అకాడమిక్ కన్వీనర్ అశోక్‌కుమార్, మాధవి, ఖలీల్, వెంకటేశ్వర్ రెడ్డి, సమీర్, వెంకటేశ్వర్లు, గౌస్‌పాషా, మురళి, అవినాష్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కలెక్టరేట్ ముందు సీపీఐ నాయకుల ధర్నా

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 12: వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ కలెక్టరేట్ ముందు సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రవి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, వాగులు తెగిపోయి పంటపొలాలు మునిగాయన్నారు. నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.30వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స రవీందర్, సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, గుండె బద్రి, పరికిరాల రమేశ్, తాళ్లపల్లి రాయల, అంజాద్, వలబోజు వెంకన్న, జన్ను రవి, జాన్‌పాల్, అక్బర్, యాకూబ్, సువర్ణ, చిరంజీవి, సుధీర్, స్వప్న, ఆర్య రాజు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అంగన్‌వాడీలను పరిశుభ్రంగా ఉంచాలి



చిన్నారుల వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

శంభునిపేట, సెప్టెంబరు 12 : అంగన్‌వాడీ కేంద్రాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ ఉర్సు సెక్టార్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి అన్నారు. నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను రమాదేవి గురువారం ఆకస్మిక తనికీ చేశారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని రమాదేవి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. అనంతరం పలు ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలకు యూపీహెచ్‌సీ వైద్యురాలు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు యశోద, హైమావతి, సుజాత, ఆశ, ఆయాలు, అంగన్‌వాడీ పర్యవేక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు

కాశిబుగ్గ, సెప్టెంబరు 12: కాశిబుగ్గలో రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా మారాయి. కాశిబుగ్గలోని గ్రంథాలయం నుంచి పద్మనగర్ వరకు 60-70 అడుగులకు ఒక గుంత చొప్పున తవ్వి వదిలారు. పదుల సంఖ్యలో గుంతలు ఉండటంతో ఆ మార్గం ప్రమాదకరంగా మారింది. రోడ్డు గుంతలుగా ఉందని స్థానికులతో వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్యాచ్ వర్క్‌లు చేయడానికి పనులు మొదలుపెట్టారు. కానీ నెమ్మదిగా సాగుతుండటంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్యాచ్ వర్క్‌లు నెమ్మదిగా చేయడం ఏంటని అక్కడి వారు ప్రశ్నిస్తున్నారు. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.



గ్రంథాలయం, టెంపుల్ వద్ద తవ్వున గుంతలు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు



క్రీడాకారులతో హెచ్ఎం, టీచర్లు

శంభునిపేట, సెప్టెంబరు 12 : రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వి.రామకృష్ణారెడ్డి తెలిపారు. పాఠశాలలోని 8వ తరగతి చదువుతున్న నాంపెల్లి నవ్యశ్రీ, ముత్యాల శ్రీలేఖ, 7వ తరగతికి చెందిన నల్లతీగల కీర్తిలు బాలికల విభాగంలో, 8, 9 తరగతులు చదువుతున్న మండల అజీమ్ బాబా, కేదారి కేశిత్‌లు బాలుర విభాగంలో ఎంపికయ్యారు. తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 15 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొననున్నారని పీఈటీ గోగు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు.

కీటక జనిత వ్యాధులను నియంత్రించాలి: డీఎంహెచ్‌వో



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పోచమ్మమైదాన్, సెప్టెంబరు12: ప్రజలకు అన్ని విధాలా అవగాహన కల్పిస్తూ ఆరోగ్య సిబ్బంది కీటక జనిత వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కాజీపేట వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం కీటక జనిత వ్యాధులు, సీజనల్ వ్యాధులపై ఆరోగ్య కేంద్రాలు, అధికారులు, సిబ్బందితో జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక కేంద్రాల వైద్యాధికారులు ఇంటింటి సర్వే, వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు వ్యాధులపై నిర్లక్ష్యం చేయవద్దని, జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ గోపాలరావు, డాక్టర్ ప్రకాష్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మోహన్‌సింగ్, డాక్టర్ పద్మశ్రీ, డిప్యూటీ డెమో అనిల్, ఇన్‌చార్జి ఏఎంవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా తవ్వకాలు


ప్రభుత్వ భూమిలో జరుగుతున్న తవ్వకాలు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 12 : మండలంలోని ఇల్లంద గ్రామ ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇల్లంద నుంచి కక్కిరాలపెల్లికి వెళ్లే దారిలో ఉన్న సర్వే నంబర్ 1626/1లోని 4 ఎకరాల భూమిని ప్రభుత్వ స్వాధీన పరుచుకున్నారు. గతంలో స్థానికులు కమ్యూనిస్టు పార్టీ సహకారంతో గుడిసెలు వేయగా, వారిని ఖాళీ చేయించి రెవెన్యూ అధికారులు బోర్డును పాతారు. ఇదే అదునుగా భావించిన కొందరు ఇసుక అక్రమ రవాణాదారులు తమ ట్రాక్టర్‌ను భూమిలోకి తీసుకువచ్చి, ఇందులో తవ్వకాలు జరిపి ఇసుకను తయారు చేస్తున్నారు. దీంతో భూమి గుంతలుగా ఏర్పడి అటు వైపుగా వెళ్లే రైతులకు సైతం ఇబ్బందిగా మారింది. రహదారిని సైతం ఛిద్రం చేస్తూ తవ్వకాలు జరుపుతున్నారు, రెవెన్యూ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మునిసిపాలిటీలో కౌన్సిల్ అత్యవసర సమావేశం

• పలు తీర్మానాలు ఆమోదం


మునిసిపాలిటీ ఎజెండా వివరాలను వివరిస్తున్న అకౌంటెంట్ రజని

నర్సంపేట, సెప్టెంబరు 12 : పట్టణంలోని మునిసిపల్ కార్యా లయంలో గురువారం చైర్ పర్సన్ గుంటి రజని అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశా న్ని నిర్వహించారు. వినాయక నిమజ్జనం, బతుకమ్మ, దసరా ఉత్సవాల నిర్వాహణ కోసం రూ.24.89 లక్షలు, ఆస్తి పన్నుల వసూళ్ల కొరకు అయిదు హ్యాండ్ హెల్త్ మిషన్లు కొనుగోలు అంశంపై తైబజార్, (పశువులు, మేకలు, గొర్రెలు రహదారి, గంపచీటీ, కమేళా) సీల్డ్ టెండర్ కొటేషన్ రేటు పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకునేందుకు ఇతర 15 అంశాలపై సమావేశంలో తీర్మానం ఆమోదించారు. కార్యక్రమంలో కమిషనర్ ఈసంపల్లి జోనా, కౌన్సిలర్లు, ఏఈ రాజేశ్, టీపీవో రమ్యకృష్ణ, అకౌంటెంట్ రజని, జూనియర్ అసిస్టెంట్ రమేశ్, ఇన్‌చార్జ్ ఆర్ఐ కావ్య పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డుపై చిగురిస్తున్న ఆశలు

• 17 నుంచి ప్రజాపాలన

వర్ధన్నపేట, సెప్టెంబరు 12: కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. ఇందులో భాగంగా ఈ నెల 17 నుంచి 10 రోజుల పాటు నిర్వహిం చే ప్రజాపాలనలో కార్డుల జారీకి సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించడంతో ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడానికి వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో కొన్ని తహసీల్దార్ లాగిన్లలో, మరికొన్ని డీఎస్‌వో లాగిన్‌లో ఉన్నాయి. గత ఏడాది డిసెంబరులో నిర్వహించిన ప్రజాపాలనకు జిల్లా వ్యాప్తంగా పలు పథకాలు వర్తింపచేయాలని లక్షలాది దరఖాస్తులు వచ్చాయి. ఇందులో రేషన్ కార్డుల కోసం చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రేషన్ కార్డుల జారీ గురించి ప్రకటన చేయడంతో కొత్త సందేహాలు మొదలయ్యాయి. అయితే కొత్తకార్డుల జారీకి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదని పౌర సరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలి


కొండూరులోని గణపతి మండపంలో ఝాన్సీరెడ్డి

రాయపర్తి, సెప్టెంబరు 12 : ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించు కోవాలని, అప్పుడే మానసిక ప్రశాంత జీవితాన్ని గడుపుతారని పాల కుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి తెలిపారు. గురువారం పన్యానాయక్‌తండా, పోతురెడ్డిపల్లి, కాట్రపెల్లి, బురాహన్‌పల్లి, తెట్టేకుంట తండా, తిర్మలాయపెల్లి, గన్నారం కొండూరు యాదవ కాలనీల్లో గణపతి మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీంద ర్ రెడ్డి, వనజా రాణి, మాచర్ల ప్రభాకర్, రాంబాబు, నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, కృష్ణరెడ్డి, భగవాన్, కేశవరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయ నిధిని విడుదల చేయాలి


మాట్లాడుతున్న పంజాల రమేశ్

నర్సంపేట, సెప్టెంబరు 12 : వరద సహాయ నిధికి రూ.10 వేల కోట్లు కేటాయించి విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మా ట్లాడారు. పంట నష్టపోయిన ప్రతీ రైతుకు ఎకరానికి రూ.30వేల వంతున నష్టపరి హారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు అక్కపెల్లి రమేశ్, మండల కార్యదర్శి గడ్డం యాకయ్య మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత, గడ్డం నాగరాజు, బాదరబోయిన యాదగిరి, చెట్టిమమత, సింగారపు శైలజ, హంస మంజులా, ఐత శ్రీకళ, ఉపేంద్ర పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగే చూడాలి

అధికారులతో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి


దామెర చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట, సెప్టెంబరు 12: పట్టణంలోని వడ్డెర కాలనీ సమీపంలోని దామెర చెరువును గురువారం సాయంత్రం అధికారులతో కలిసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సందర్శించారు. గణనాథులను ఉత్సవ కమిటీలు నిమ్మజ్జనం చేయడానికి సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో చెరువువద్ద నిమజ్జనం కోసం మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యుత్ తదితర ఏర్పాటు చేసి నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని వినాయకుల నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని కిషన్, మునిసిపల్ ఉద్యోగి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు, పోలీసు, రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం విద్యుత్‌శాఖ అధికారులతో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులు ఉండి విద్యుత్ మీటర్లులేని వారికి నిబంధనల మేరకు రూ: 938 చెల్లిస్తే వారికి విద్యుత్ మీటర్లు అందించి వారిని గృహజ్యోతి పథకానికి అర్హులను చేయాలని విద్యుత్ శాఖాధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. డివిజన్‌లోని మండలాలకు సంబంధించిన సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం, లూజ్‌లైన్లను సరిచేయడం, మిడిల్ పోల్స్ వేయడం, కరెంట్‌వైర్లు దూరంగా ఉన్న ఇండ్లకు లైన్లు వేయాలని విద్యుత్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఇండ్లపై ఉన్న విద్యుత్ లైన్ల గురించి చర్చించారు. కార్యక్రమంలో డీఈ శ్రీధర్, నర్సంపేట నపట్టణ ఏడీఈ బి.లక్ష్మన్, నెక్కొండ ఏడీఈ మల్లేశం, నర్సంపేట పట్టణ ఏఈ శ్రీధర్, గిర్నిబావి ఏఈ రామకృష్ణ, నల్లబెల్లి ఏఈ రాజు, దుగ్గొండి ఏఈ రాంమూర్తి, నెక్కొండ ఏఈ చిరంజీవి పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులను ఆదుకోవాలి

విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదాలకు గురైన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఆర్థికసాయం అందించే విధంగా మునిసిపాలిటీలో తీర్మానం చేయించాలని కోరుతూ గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి కార్మికులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో చిలపాక యశోద, హన్మకొండ మరియ. మాదాసి కొమురయ్య, గొ రై సాంబయ్య., మైసిగోపి. గనిపాక బాబు,జెట్టి రాములు, బుర్రి ఉమ,హర్షం ఉపేంద్ర, ఇల్లందుల ఎల్లమ్మ, తాండ్ర సుగుణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

నర్సంపేట టౌన్ : అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం డివిజన్ అధ్యక్షుడు ఆరెల్లి వేణు గౌడ్ ఆధ్వర్యంలో గురువారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు సిహెచ్. క్రాంతి కుమార్, కార్యదర్శి ప్రవీణ్, మల్లయ్య పాల్గొన్నారు.

'విజిలెన్స్' దూకుడు

(5వ పేజీ తరువాయి)

తీసింది. కొన్ని ఏళ్లుగా భూ కబ్జాలపై ఎన్నో అం దోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జరు గుతున్న విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే ఆశతో విద్యార్థులు, ఆధ్యాపకులు ఎదు రుచూస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన భూ ములు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకట్ట పడు తుందనే చర్చ జరుగుతోంది. అలాగే గత ప్రభు త్వం నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ వ్యయంపైన కూడా నిజాలు విజిలెన్స్ నిజాలను వెలుగులోకి తీసుకు వస్తారని, సీఎంఆర్ఎఫ్‌లో కోట్లాది రూపాయల దుర్వినియోగంపై కూడా వాస్తవాలు బయటకు తీసుకువస్తారా? అనేది చర్చనీయాంశంగా మారిం ది. విజిలెన్స్ చేపడుతున్న విచారణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అక్రమార్కులు ఇప్పటికే నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో వడ్డట్లుగా ప్రచారం జరుగుతోంది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విచారణ లతోనే వదిలేస్తారా? లేక ప్రభుత్వం పరంగా చర్యలు ఉంటాయా? అనే చర్చ ఓరుగల్లువాసుల్లో జరుగుతోంది.

వైకుంఠధామాలను పరిశుభ్రంగా ఉంచాలి

సంగెం, సెప్టెంబరు 12: గ్రామాల్లోని వైకుంఠధామాలను పరిశుభ్రంగా ఉంచాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి సూచించారు. గురువారం మొండ్రాయిలోని వైకుంఠధామాన్ని సందర్శించి గ్రామ పంచాయతీ సిబ్బందికి పలు సూచనలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకుంఠధామాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీపై దాడులను అరికట్టాలి

గీసుగొండ, సెప్టెంబరు 12 : ఆర్ఎంపీ, పీఎంపీలపై మెడికల్ కౌన్సిల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దాడులనుఅరికట్టాలని ఆ సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. సంఘం నాయకులు తహసీల్దార్, ఇన్‌స్పెక్టర్‌కు గురువారం వినతిపత్రాలను అందించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ముండ్రాతి కైలాసం, కార్యదర్శి బిట్ల శివప్రసాద్, కోశాధికారి రవిందర్, నాయకులు ఏడాకుల రాజిరెడ్డి, రాజేశ్వర్‌రావు, నరసింహస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● సంగెం: ఆర్ఎంపీలపై జరుగుతున్న దాడులను నివారించాలని ఆర్ఎంపీల సంఘం ఆధ్వర్యంలో సంగెంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రకోటి రవి, జిల్లా కమిటీ కార్య దర్శి శ్రీనివాస్, మండలశాఖ అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి లక్ష్మీ నర్సయ్య, గౌరవ అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులను ఆపాలని డిప్యూటీ తహసీ ల్దార్‌కు వినతి పత్రంను అందించారు. మండల కేంద్రంలో శాంతి యుత ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎస్ ఐలయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్, డివిజన్ కోశాధికారి నరేష్, జిల్లా కార్యదర్శి స్వామిగౌడ్, జగన్, దేవేందర్, అనిల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● పర్వతగిరి : ఆర్ఎంపీ, పీఎంపీలపై జరుగుతున్న దాడులను ఆపాలని కోరుతూ మండల కేంద్రంలో ఆర్ఎంపీలు ర్యాలీ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ వెంకటస్వామికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఏకాంబ్రం, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి భిక్షపతి, లింగమూర్తి, కార్యవర్గసభ్యులు సంపత్, మహేందర్, అశోక్, శ్రీధర్, నర్సయ్య పాల్గొన్నారు.

● నెక్కొండ: ప్రభుత్వ దాడులను నిరసిస్తు నెక్కొండలోని అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్న గ్రామీణ వైద్యుల సేవలను ప్రభుత్వం గుర్తించి తమపై చేస్తున్న దాడులను మానుకొని వైద్యంలో శిక్షణఇపించాలని మండల ఆదర్శ వైద్యుల సంఘం అధ్యక్షుడు కుడికాల కుమారస్వామి డిమాండ్‌చేశారు. గ్రామీణ వైద్యులకు మండల మాజీ వైస్ ఎంపీపీ సారంగపాణి, జీపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటయ్య, సోమయ్య మల్లయ్య ప్రకాశం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు సాంబయ్య, రమేశ్, వేణుగోపాల్, రవి, శంకర్, అశోక్, వాసు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్ల పంపిణీ

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 12 : మండలంలోని ఇల్లందకు చెందిన ఇద్దరు దివ్యాంగులకు ఎస్ఆర్ఆర్ ఇన్ ఫ్రా డెవలప్‌మెంట్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి బ్యా టరీ సైకిళ్లను పంపిణీచేశారు. గురువారం ఆయన ఆదేశాల మేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు సైకిళ్లను అందిం చారు. దివ్యాంగుల్లో మనోధైర్యం నింపేందుకే సైకిళ్లను అందించినట్లు శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం


చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చెన్నారావుపేట,సెప్టెంబరు 12 : నర్సంపేట నియోజకవర్గంలో బంజారా భవన్‌ను మంజూరు చేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ మండల కేంద్రంలో గురువారం బంజారా నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవ రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. బంజారా నాయకులు మాట్లాడుతూ నియోకవర్గంలో ప్రత్యేకంగా బంజారా భవన్ ఏర్పాటు కు కృషి చేయడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్యగోపాల్ నాయక్, శోభన్, నర్సంపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, బంజారా నాయకులు పాల్గొన్నారు.

ఎద్దు పొడవడంతో రైతు మృతి


సాంబయ్య (ఫైల్)

గీసుగొండ, సెప్టెంబరు 12: ఎద్దు పొడవడంతో ఓ రైతు మృతిచెందిన ఘటన మండలంలోని శాయంపేట హవేలిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సముద్రాల సాంబయ్య(58) గ్రామసమీపంలోని తన పొలంలో వ్యవసాయ పనులు చేసేందుకు బుధవారం ఎడ్లను తీసుకొని వెళ్లాడు. అక్కడ వాటిని మేపుతూ సాంబయ్య పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఒక ఎద్దు వచ్చి సాంబయ్యను పొడవగా, కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

రాయపర్తి, సెప్టెంబరు 12 : కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి శ్రీధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కాలేజీలోని పలు రికార్డులను, పరిసర ప్రాంతా లను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలేజీలో అన్ని గ్రూపుల్లో అడ్మిషన్లు అయ్యేలా చూసుకోవాలన్నారు. వార్షిక ఫలితాలపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని, అధ్యాపకులు నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయ కుమారి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు సువర్ణ అవకాశం


కడారిగూడెంలో వినియోగదారుడికి రశీదును అందజేస్తున్న డీఈ భిక్షపతి

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 12 : నిరుపేద కుటుంబాలకు చెందిన వ్యక్తులు ప్రభు త్వం కల్పించిన కొత్త విద్యుత్ మీటరు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవా లని, వినియోగదారులకు ఇది సువర్ణ అవకాశామని వర్ధన్నపేట డీఈ భిక్షపతి, ఏడీఈ కన్న రాజులు కోరారు. గురువారం మండలంలోని రామోజీ కుమ్మరిగూడెం తండా, కడారిగూడెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ మీటర్ల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు సంబంధిత డాక్యుమెంట్స్ ఇంటి పన్ను రశీదు, ఆధార్ కార్డు, రూ.938 సంబంధిత లైన్ ఇన్స్‌పెక్టర్, లైన్‌మెన్, జేఎల్ఎంలకు అందిస్తే వెంటనే మీటరు అమరుస్తారని తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 17 వరకు మాత్రమేఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 12 : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్, షేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన తస్మాత్ జాగ్రత్త వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం షేర్ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ టి. శిరీష బాల బాలికల రక్షణ, పరిరక్షణపై వివరించారు. కార్యక్రముమంలో హెచ్ఎం కాంతారావు, అరుణకుమారి, ప్రశాంతి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

● బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత

గీసుగొండ : బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యతని సర్వోదయ సంస్థ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఇందిర అన్నారు. గీసుగొండ జెడ్పీ పాఠశా లలో లింగ వివక్షతపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. బాలల హక్కుల ఉల్లంఘన జరిగితే హింసకు దారితీస్తుందన్నారు. పాఠశాలలో బాలపరిక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విట్టోబా, వెంకట్రావ్,పద్మ, జ్యోత్స్నప్రభ, రవిచంద్ర, అక్తర్, వనిత పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

నెక్కొండ, సెప్టెంబరు 12: రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధికి అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు వినియోగించుకోవడంతో పాటు ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని నర్సంపేట టీపీసీసీ మెంబరు సొంటిరెడ్డి రవీందర్‌రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని దీక్షకుంటలో గణేశ్ గ్రామ ఐక్య సంఘం సభ్యులకు గురువారం సీల్ వాటర్ బాటిల్స్, పింగాణి టీ కప్పులు, జూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీ రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, హరిప్రసాద్, నాయకులు చెన్నకేశవులు, మైపాల్‌రెడ్డి, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి


కోపాకుల చెరువును పరిశీలిస్తున్న అధికారులు

పర్వతగిరి, సెప్టెంబరు 12 : గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని డీసీవో, మండల స్పెషల్ ఆఫీసర్ నీరజ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిమజ్జనానికి చెరువులను గుర్తించి ప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అనంతరం నూతనంగా మండల స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన నీరజను ఎంపీడీవో శంకర్‌నాయక్, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్, ఈసీ రాజు పాల్గొన్నారు.

● నల్లబెల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నరసింహమూర్తి అధ్యక్షతన వినాయక నిమజ్జన ఏర్పాట్ల గురించి సమీక్ష సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ముప్పు కృష్ణ పాల్గొని మాట్లాడారు. మండలంలో మొత్తం 93 వినాయకుడి విగ్రహాలు ఉన్నాయని 15, 16, 17 తేదీల్లో నిమజ్జనం చేస్తారని తెలిపారు. చెరువుల వద్ద సిబ్బందితో నిమజ్జన ఏర్పాట్లు జాగ్రత్తగా చూడాలన్నారు. అనంతరం నల్లబెల్లి చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ప్రశాంత్ బాబు, ఎంపీవో పసరుగొండ రవి, విద్యుత్ శాఖ అధికారులు, ఇరిగేషనల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం కోసం ఏర్పాట్లను అధికారులు గురువారం పరిశీలించారు. ఎంపీడీవో శ్రీవాణి మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువుల వద్ద బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. చెరువు వద్దకు వెళ్లాడానికి రోడ్డు సౌకర్యాన్ని పరిశీలిస్తున్నామన్నారు. గ్రామాల్లో చెరువుల వద్ద వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎస్సై రాజేష్‌రెడ్డి, ఎంపీవో శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు

దుగ్గొండి, సెప్టెంబరు 12 : గ్రామాల్లో పారిశుధ్యంపై గ్రామ సబ్బంది నిర్లక్ష్యం చేయరాదని నిరతంరం పనిచేస్తూనే ఉండాలని డీఎల్‌పీవో రాజీవ్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని చలపర్తిలో డీఎల్‌పీవో సందర్భంచి అన్ని వాడలను తనిఖీ చేశారు. గ్రామంలోని వర్మి కంపోస్టు, పల్లె ప్రగతి పనులు, డంపింగ్ యార్డు, పరిశీలన చేసి వర్మి కంపోస్టులో పొడి చెత్త, తడి చెత్తలను కలెక్టు చేసి ఎరువుగా తయారు చేయాలని కార్యదర్శి కావ్యను ఆదేశించారు. సందర్శించిన వారిలో ఎంపీవో శ్రీధర్, ఎఫ్ఏ, ప్రశాంత్. గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

హెచ్ఐవీ రోగులపై వివక్ష తగదు

నల్లబెల్లి, సెప్టెంబరు 12 : హెచ్ఐవీ ఏయిడ్స్ రోగుల పట్ల వివక్షత చూపడం తగదని వైఎర్టీకేర్ లింక్ వర్కర్ స్కీం, క్లస్టర్ లింక్ వర్కర్ సామల వీరన్న అన్నారు. మండలంలోని రంగాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐఈసీ క్యాంపస్‌లో 8, 9, 10తరగతి విద్యార్థులకు హెచ్ఐవీ, ఎస్‌టీబీ, టీబీ వ్యాప్తి, నివారణ చర్యల గురించి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రఘువీర్, ఉపాధ్యాయ బృందం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీ షర్టుల పంపిణీ

ఖానాపురం, సెప్టెంబరు 12 : మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన దబీర్‌పేటలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో, టీడబ్ల్యూపీఎస్ రాంనాయక్‌తండాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం టీషర్టులు పంపిణీచేశారు. జేడీ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ పింగిళి కవితారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో భాగస్వాములం అవుదామనే నినాదంతో పేద పిల్లలకు టీ షర్టులు, లైబ్రరీ పుస్తకాలు అవసరాన్ని బట్టి అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంలు వెంకట్రాం, లక్ష్మయ్య, సౌజన్య, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి,కిష్టయ్య రాజశేఖర్, బాస్కర్, లింగారెడ్డి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జేడీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గురువారం టీ షర్టుల పంపిణీ కార్యక్రమంను చేపట్టారు. జేడీ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ కన్వీనర్ పింగిళి కవితారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణను ఆదర్శంగా తీసుకొని ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పాపమ్మ, హెల్పింగ్ హ్యాండ్ అధ్యక్షుడు చెవ్వ రాజేంద్రప్రసాద్, కృష్ణమూర్తి, ఉమాదేవి, ఈదునూరి రవిందర్, రవి, ఇంద్రాసేనారెడ్డి, పెండెం భాస్కర్, సంకటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 12 : పట్టణంలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి టీం లీడర్ నెల్లుట్ల సుమన్ ఆధ్వర్యంలో కళాకారులు యువతకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిసలై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో కళాకారులు తాళ్ల సునీల్, యోచన, రాజేందర్, రవీందర్, శ్రావన్, అవినాష్, సురేందర్, రాజు, నవీన్, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రాజు (ఫైల్)

పర్వతగిరి, సెప్టెంబరు 12 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చింతనెక్కొండ లో జరిగింది. ఎస్సై ప్రవీణ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఏడెల్లి రాజు (40) కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 6వ తే దీ రాత్రి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక గడ్డి మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనం సహాయంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుని భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు ఓటరు జాబితా ప్రదర్శన

పర్వతగిరి, సెప్టెంబరు 12 : మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం ఓటరు ముసాయిదా జాబితాను ప్రదర్శించనున్నట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ తెలిపారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నచో పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని ఆయన సూచించారు.

రాష్ట్రస్థాయికి ఎన్నికైన విద్యార్థులు


బేస్‌బాల్‌కు ఎంపికైన విద్యార్థినులు

నెక్కొండ, సెప్టెంబరు 12 : తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల నెక్కొండలో విద్యనభ్యసిస్తున్న నలుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి.మమత గురువారం తెలిపారు. ఈ నెల 10న వరంగల్ ఓసీటీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.జానవి, వి.గాయిత్రి, పదో తరగతి చదువుతున్న పి.మణిచందన, జి.అంజలి పాల్గొని చక్కటి ప్రతిభ ను కనబర్చడంతో ఈ నెల 14 నుంచి నిర్మల్‌లో జరిగే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థినులను పీఈటీ కమలకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

● వర్ధన్నపేట రూరల్ : రాష్ట్రస్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్ పోటీలకు మండలంలోని ఇల్లంద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులుఎంపికైనట్లు హెచ్ఎం విజయ తెలిపారు. గురువారం ఎంపికైన 9వ తరగతి చదువుతున్న ఐశ్వర్య, పరమేశ్వర్ లను అభినందించారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిర్మల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

● సంగెం: మండలంలోని మొండ్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బేస్‌బాల్ జూనియర్స్ స్థాయి ఎంపికలో ప్రతిభ కనబర్చారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. అనంతరం హెచ్ఎం విజయ మాట్లాడుతూ వరంగల్ ఓ సీటీలో జిల్లాస్థాయి బేస్‌బాల్ జూనియర్స్ విభాగంలో పాఠశాలకు చెందిన సాయిచరణ్, విష్ణువర్దన్, తేజ, దీపిక, వైష్ణవిలు ప్రతిభ కనబర్చి ఈనెల16న నిర్మల్‌లో జరిగే 5వ రాష్ట్రస్థాయి జూనియర్స్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ అనుముల శ్రీలత, ఉపాధ్యాయులు మనోహర్, రామచంద్రం, ప్రకాష్, మాధవి, జ్యోతి, రాణి, స్వామి, వీరకుమార్, రఘుపతిరెడ్డి, సుమతి, అరుణాదేవి, హన్మంతరావు పాల్గొన్నారు.